
# సత్యవాక్కు




## క్రైస్తవ మాస పత్రిక

## మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా, లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందుచున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. **20/-** లు మాత్రము పోస్టేజి ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
P.O. Box 80, Sambamurthi St.,
KAKINADA - 533 004.

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియ జేయుండి. ఇది అత్యవసరం!!

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 13 | జూన్ 1993 | సంచిక 11

## సంపాదకీయము

### మానవు డేపాటి వాడు

### ( What is Man )

భక్తుడైన దావీదు ఇట్లు వ్రాసెను: "యెహోవా మా ప్రభువా, ఆకాశములో నీ మహిమను కనుపరచువాడా, భూమి యందంతట నీ నామము ఎంత ప్రభావము గలది!...నీ చేతి పనియైన నీ ఆకాశమును నీవు కలుగజేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు? నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు? దేవునికంటె వానిని కొంచెము తక్కువ వానిగా చేసియున్నావు. మహిమా ప్రభావములతో వానికి కిరీటము ధరింపజేసియున్నావు. నీ చేతి పనులమీద వానికి అధికారమిచ్చియున్నావు. గొర్రెల నన్నిటిని, ఎడ్ల నన్నిటిని, అడవి మృగములను ఆకాశ పక్షులను సముద్ర మత్స్యములను సముద్ర మార్గములలో సంచరించు వాటి నన్నిటిని వాని పాదముల క్రింద నీవు ఉంచియున్నావు.

యెహోవా మా ప్రభువా భూమియందంతట నీ నామము ఎం
ప్రభావము గలది ?" (దా. కీర్తన 8).

ఇది ఇట్లుండగా మానవుడు పాపియైనాడు. అతని రక్షించు
నిమిత్తము దేవుడు తన స్వంత కుమారుని సయితము సిలువపై బలి
అర్పించుటకు సంసిద్ధుడైనాడు (యోహాను 3 : 16, 17). అయితే
ఆయన అట్లు ఎందుకు చేసాడు ? మానవుడంటే దేవునికి అంత
ప్రాధాన్యత ఎందుకో లేఖనములనుండి తెలిసికొందము.

1. నేలమంటినుండి దేవుడు మానవుని సృజించాడు (ఆది కా.
2 : 7). అందువలన మానవుడు మృతి జెందినపుడు అతని శరీరము
మంటితో కలియును (ప్రసంగి 17 : 7).

2. శారీరకంగా మానవుడు పరిపూర్ణుడు కాదు. అందువలన
అతనికి సాటియైన సహాయముగా యుండు నిమిత్తము ఆయన స్త్రీని
నిర్మించెను (ఆది 2 : 18). ఇప్పుడు స్త్రీ పురుషు లిద్దరు ఏకమై పరి
పూర్ణులయ్యారు. వారు కలసి జీవించగలరు, సహాయపడగలరు,
సంతానాభివృద్ధి చేసికొనగలరు. వారి పిల్లల పిల్లల ద్వారా తరతర
ములు అభివృద్ధి యగుదురు. "స్త్రీ పురుషునినుండి కలిగెనేగాని పురు
షుడు స్త్రీ నుండి కలుగలేదు. మరియు స్త్రీ పురుషుని కొరకే గాని
పురుషుడు స్త్రీ కొరకు సృష్టించబడలేదు" (1 కొరింథీ 11 : 8, 9).
"అయితే ప్రభువునందు స్త్రీకి వేరుగా పురుషుడు లేడు, పురుషునికి
వేరుగా స్త్రీ లేదు. స్త్రీ పురుషునినుండి ఏలాగు కలిగెనో ఆలాగే
పురుషుడు స్త్రీ మూలముగా కలిగెను, గాని సమస్తమైనవి దేవుని
మూలముగా కలిగియున్నవి" (1 కొరింథీ 11 : 11, 12). స్త్రీ పురుషు
లిద్దరు ఒకరిపై నొకరు ఆధారపడి యున్నవారు. వారేకమై పరిపూ
ర్ణులవుదురు. అందువలన బైబిలు మానవునిగూర్చి చెప్పునప్పుడు
దానిలో స్త్రీ పురుషు లిద్దరు మిళితమై యున్నారు.

3. మానవుడు దైవ సృష్టికి కిరీటము వంటివాడు. దేవుడతనికి ఆత్మ ననుగ్రహించాడు. "దేవుడు-మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము; వారు సముద్రపు చేపలను, ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని, భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురు గాకనియు పలికెను. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను" (ఆది కా. 1 : 26-27).

"మన స్వరూపమందు, మన పోలిక చొప్పున" అని దేవుడు అన్నప్పుడు, ఆ సృష్టి క్రియలో దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ ఇమిడియున్నారు. మరియు దేవుడు ఆత్మ గనుక (యోహా 4 : 24) మానవునికి కూడ ఆత్మ (అంతరాత్మ) స్వరూప మీయబడెను. దేవుడు భౌతిక కాయుడు కాదు గనుక మానవుని భౌతిక స్వరూపం దేవుని స్వరూపం కాదు. మానవుని భౌతిక స్వరూపాన్ని దేవుడే చేసినను, దేవుడు "వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది. కా. 2 : 7). మానవుడు మరణించగా అతని ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు పోవును (ప్రసంగి 12 : 7).

4. మానవుని ఆత్మ నిత్యము ఉండునది. అది అంతరంగ పురుషుడని, పరలోక సంబంధుడని పిలువబడినది (2 కొరింథీ 4 : 16; 1 కొరింథీ 15 : 47-49). "ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి" యని యేసు చెప్పెను (మత్త 10 : 28). దేవునినుండి నిత్యము వేరైన స్థితిలో ఆత్మ మరణించును, గాని, అది సర్వనాశనము గావించబడునని దాని యర్థము కాదు. అందువలన ఈ లోకమంతటికంటె ఆత్మ విలువ ఎక్కువ (మత్త 16 : 26). మానవుడు దేవుని మాటలను విని, ఆయనకు లోబడితే

తన పాపముల నుండి రక్షించబడి నిత్యజీవ నిరీక్షణను కలిగియుండును (మత్త 17 : 5; లూకా 9 : 23; మార్కు 16 : 16; యోహా 14 : 1-3).

5. మానవుడు దేవుని నారాధించాలి, సేవించాలి, మరణ పర్యంతము నమ్మకముగా యుండాలి (యోహా 4 : 24; మత్త 6:24; ప్రక 2 : 10). సమస్తము ఆయన పేరిట చేయుటవలన మానవుడు దేవునికి మహిమను, ఘనతను తెచ్చును (కొలస్స 3 : 17). క్రీస్తు సంఘములో యుండుటద్వారా అతడాయనను ఘనపర్చును (ఎఫెసీ 3 : 21).

6. ఆలోచించడానికి, యోచించడానికి, నిశ్చయించుటకు, ఇచ్ఛయించుటకు, విశ్వసించుటకు, విధేయత చూపుటకు, ఆరాధించుటకు, మాట్లాడుటకు, నమ్మకముగా యుండుటకు మానవునికి మనస్సు (మేధస్సు) ఉన్నది. అతడు తిరస్కరించవచ్చు, కాదనవచ్చు, ఎదురాడవచ్చు, అవిధేయత చూపవచ్చు, దేవుని ప్రేమను రక్షణను నిరాకరించవచ్చు కూడ. అయితే దేవుని కృపను దయను అంగీకరించు వారిని ఆయన రక్షించును, ఆశీర్వదించును, తనకొరకు కాపాడును (ఎఫెసీ 2 : 8, 9).

7. మానవుడు దేవునికి లెక్క అప్పగించాలి. నిత్యత్వాన్ని పరలోకంలోనో, నరకంలోనో అతడు గడపాలి. ఎక్కువ ఇయ్యబడిన వానినుండి ఎక్కువ కోరబడును. "గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను అని వ్రాయబడియున్నది" (రోమా 14 : 12). దేవుడు తన వాక్యాన్ని బట్టి, మనం చేసిన ప్రతి క్రియకు అది మంచిదే గాని, చెడ్డదేగాని తీర్పుతీర్చును (అపో. కా. 17 : 31, యోహా 12 : 48; 2 కొరి 5 : 10). నీతిమంతులు నిత్య జీవములోను, దుష్టులు నిత్యనరకంలోను ప్రవేశింతురు (మత్త 25:46).

మానవుడెవరు ? అతడు ద్వితత్వజ్ఞుడు. భౌతిక కాయుడు, ఆత్మీయ జీవుడు. అతడు మర్త్యుడు అమర్త్యుడు. అతడు చనిపోవును గాని బ్రతుకును. అతడు నీవు, నేను. అతడు భూ నివాసి. గాని చివరకు ఆత్మయొక్క నిత్యగృహమగు పరమునకుగాని, నరకానికిగాని పోవును. అతడెంత గొప్పవాడో, ఎంత ఘనుడో, అతని అవసరత ఎంత గొప్పదో! అతనికి దేవుడవసరం, రక్షణ అవసరం. మనల్ని రక్షించి ఆయనతో నిత్యము జీవించులాగున మనం సిద్ధపడాలని దేవుడు కోరుచున్నాడు. ఆయనను మనం మనకొరకు నిరుత్సాహపర్చరాదు.

★

## క్రీస్తు సంఘ ఆరంభము

## (The Beginning of the Church of Christ)

మానవ ఊహాగానము లన్నిటిని ఒక ప్రక్కన పెట్టి బైబిలు గ్రంథాన్ని జాగ్రత్తగా చదివితే, యేసుక్రీస్తు స్థాపించిన సంఘము యొక్క కాలము, స్థలము మనము నిశ్చయంగా తెలిసికోగలము. అది పరలోక రాజ్యమనకూడ పిలువబడినది.

దానియేలు 2 : 31-34 లో నాలుగు సర్వసామ్రాజ్యములను గూర్చి మనము చదువగలము. వాటిలో నాల్గవ (రోమా) సామ్రాజ్య కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును (దాని 2 : 44). అంత్యదినములలో యెరూషలేములో దేవుని మందిరము స్థాపించబడునని యెషయా, మీకా ప్రవక్తలు ప్రవచించిరి (యెష 2 : 4; మీకా 4 : 1, 2). దేవుని మందిరమే ఆయన సంఘము (1 తిమో 3 : 15). మరియు ఆయన రాజ్యము, సంఘము ఒక్కటే. ఏలయనగా సువార్త ద్వారా లోకములోనుండి పిలువబడిన ప్రజలే సంఘము. వారు క్రీస్తు రాజు చట్ట ప్రకారము జీవింతము. అందువలన వారాయన రాజ్యము.

రాజ్యము సమీపముగా యున్నదని బోధించుచు బాప్తిస్మ మిచ్చు యోహాను వచ్చాడు (మత్తై 3 : 1, 2). యేసుప్రభువుకూడ అదే సంగతిని బోధించారు. తరువాత ఆయన 12 మందిని, వారి తరువాత 70 మందిని ఆ వర్తమానమునే బోధించుటకు పంపారు. దేవుని శాసనము లేక పలుకుబడి ఆసన్నమై యున్నదని వారందరు బోధించారు (మత్తై 10 : 7; మార్కు 1:15; లూకా 10 : 9). నీ రాజ్యము వచ్చుగాక యని ప్రార్థించుమని యేసు తన శిష్యులకు నేర్పించాడు (మత్తై 6 : 9, 10). మరియు ఆయన తన సంఘాన్ని స్థాపించెదనని వాగ్దానము చేసారు (మత్తై 16 : 18).

ఈ లేఖన భాగాలన్నీ ఆయన సంఘము లేక రాజ్యము అప్పటికి స్థాపించబడలేదు గాని, అది త్వరలో ఆరంభము కానున్నదని బోధించుచున్నాయి. ఇంకా, కొందరు అపొస్తలులు జీవించి యుండగానే అది ఆరంభము కావలసియున్నది (మత్తై 16 : 28; మార్కు 9 : 1). క్రీస్తు పునరుత్థానుడైన తరువాత అపొస్తలులు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించాలని ఆయన ఆజ్ఞాపించారు. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధించబడును (మత్తై 28 : 18-20; మార్కు 16 : 15, 16). అపొస్తలులు పైనుండి శక్తి పొందేవరకు యెరూషలేములో కనిపెట్టవలెనని యేసు వారికి చెప్పెను (లూకా 24 : 49). పరిశుద్ధాత్మ వారిమీదికి వచ్చినప్పుడు వారు శక్తి నొందెదరు (అపొ. కా. 1 : 8).

క్రీస్తు పునరుత్థానుడైన మొదటి పెంతెకొస్తు దినమున ఈ సంగతులు నెరవేరినట్లు మనం చూడగలము (అపొ. కా. 2). యేసు చెప్పిన రీతిగానే వారు యెరూషలేములో కనిపెట్టుచుండిరి. పరిశుద్ధాత్ముడు వారిమీదికి రాగా శక్తి పొందినవారై వారు యిదివరకు ఎన్నడు నేర్చుకొనని భాషలలో మాట్లాడసాగిరి (అపొ.కా. 2:1-4).

క్రీస్తు సువార్త ఆనాడు బోధింపబడుటకు ఆరంభమై నేటికిని కొనసాగుచున్నది. పేతురు మొదటి సువార్త సందేశమును విన్పించాడు. దానిని విని విశ్వసించినవారు బాప్తిస్మము పొందిరి, అలాగున రక్షింపబడిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో దినదినము చేర్చుచుండెను (అపొ. కా. 2 : 41, 47).

అపొ. కార్యములు 2వ అధ్యాయమునుండి ప్రకటన గ్రంథము చివరి వరకు చూస్తే సంఘము లేక రాజ్యము స్థాపించబడి యున్నట్లే మనకు కనబడును (అపొ. కా. 13 : 1-3; కొలస్స 1 : 13; ప్రక 1 : 9). గనుక అపొస్తలుల కార్యములకు ముందుగాని వెనుకగాని యున్న లేఖనాలన్నీ సంఘము పెంతెకొస్తునాడు స్థాపించబడినదని, అది యెరూషలేములో స్థాపించబడినదని సూచించుచున్నవి.

—లోయడ్ ఎల్లిస్.

— o —

## ఫీ నె హ సు

ఫీనెహాను లేవీగోత్రికుడు, ఇతని తండ్రి అహరోను కుమారుడైన ఎలియాజరు. ఇతని కాలమందు ఇశ్రాయేలీయుల మధ్య శాపకరమైన తెగులు వ్యాపించి ఇరువదినాలుగు వేలమంది చనిపోయిరి. కారణం ఇశ్రాయేలీయుల నాశనము కోరిన మోయాబు రాజైన బాలాకు, బిలాము బోధను అనుసరించి ఇశ్రాయేలీయులకు ఒడ్డినఉరిలో కామాంధులైన వారంతా చిక్కుకొని శాపము తెచ్చుకొనిరి (ప్రక 2 : 14, సంఖ్యా 25 : 1-13). ఫీనెహాసు తన దేవునియందు ఆసక్తి గలవాడై ఇశ్రాయేలీయులలో దేవుడు ఓర్వలేని దాని నతడును ఓర్వలేక పౌరుషముగలవాడై యీటెను చేతపట్టుకొని వెళ్ళి ప్రాయశ్చిత్తము జరిగించుటవలనను ఇశ్రాయేలీయుల పైనగల దేవుని కోపము మళ్ళించెను. వెంటనే తెగులు నిలిచిపోయెను.

సర్వోన్నతుడైన పరిశుద్ధ దేవుని పక్షముగా ఫీనెహాసు చేసిన గొప్ప పనిని గూర్చి "యెహోవా మోషేకు ఈలాగు ఆజ్ఞ ఇచ్చెను. యాజకుడైన అహరోను మనుమడును ఎలియాజరు కుమారుడునైన ఫీనెహాసు, వారి మధ్యను నేను ఓర్వలేనిదానిని తానును ఓర్వలేక పోవుటవలన ఇశ్రాయేలీయుల మీదనుండి నా కోపము మళ్ళించెను గనుక నేను ఓర్వలేక యుండియు ఇశ్రాయేలీయులను నశింప జేయలేదు".

తన దేవుడైన యెహోవాయందు భయభక్తులతో పౌరుషము గలవాడై దేవుని నీతిని మిక్కిలి ఆసక్తితో, త్యాగముతో జరిగించి యుండగా అదే లేవీగోత్రానికి చెంది, యాజక బృందములో జీవించు చున్న మరొక ఫీనెహాసును మీకు పరిచయము చేస్తాను. ఇతడు షిలోహు వాసియైన ఏలీ అను యాజకుని కుమారుడు (1 సమూ 1:3).

ఈ ఫీనెహాసు యాజకధర్మము నిర్వహించుచూ మిక్కిలి దుర్మార్గుడని పేరుపొందెను (1 సమూ 2 : 12). మరియు ప్రత్యక్షపు గుడారము దగ్గర పరిచర్య చేయు స్త్రీలతో వ్యభిచరించుచు యెహో వాకు అర్పింపబడిన బలి పశువుల మాంసమును, క్రొవ్వును యెహో వాకు చెందకుండా తానే తినివేయుచు దేవుని భయము కొంచెమైనను లేక విచ్చలవిడిగా తన శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుచు తన కడుపే దేవుడని నమ్ముకొని దేవునికి కాక తన కడుపునకే దాసుడుగా జీవించుచుండెను. అయ్యో ఎంత భయంకరము! హఠాత్తుగా ఒక్క దినమందే ఈ దుర్మార్గుడైన ఫీనెహాసు, తన కుటుంబము, తన అను చరులు నాశనమైరి. తాము పొందిన ఆ భయంకర శాపమునుండి తప్పించువాడు లేకపోయెను. వారిమధ్యనుండి దేవుని ప్రభావము తొలగిపోయెను. క్షణకాలపు సుఖభోగముల నాశించి శాశ్వతకాల శాపము తెచ్చుకొనిన ఫీనెహాసు అట్లుండగా, దేవునియందుగల ఆస క్తితో పౌరుష వీరుడైన ఫీనెహాసు ఎట్లుండెను? ఏమి పొందెను?

దేవుడు ఓర్వలేనిదానిని అతడును ఓర్వలేకపోయెను. అందుచే దేవుడు ఇట్లు సెలవిచ్చెను. "కాబట్టి నీవు అతనితో ఇట్లనుము - నేను నా సమాధాన నిబంధనను చేయుచున్నాను. అది నిత్యమైన యాజక నిబంధనగా అతనికిని అతని సంతానమునకును కలిగియుండును. ఏలయనగా అతడు తన దేవుని విషయమందు ఆసక్తిగలవాడై ఇశ్రాయేలీయుల నిమిత్తము ప్రాయశ్చిత్తము చేసెను" (సంఖ్యా 25:12-13).

ఆహా! వీరిరువురు ఒకే పేరుతో పిలువబడుచున్న ఒకే గోత్రికులు. ఒకే యాజకవంశమునకు చెందినవారే అయినను వీరిరువురి స్వభావము ఒకటి కాదు. వీరి విశ్వాసములో ఏకత్వము లేదు, పరిచర్యలో పొత్తు లేదు. వీరి జీవితఫలము ఒకటి కాదు. ఒకనికి జీవము, మరొకనికి మరణము. ఒకనికి దీవెన మరొకనికి శాపము. వారి సంగతి ఇట్లుండగా క్రీస్తు సంఘములో మనమెట్లున్నాము? "ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెను". "మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆపంటనే కోయును. ఏలయనగా శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును".

అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి. జారులైనను, విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనము గలవారైనను, పురుష సంయోగులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు.

"మెళకువగా ఉండుడి విశ్వాసమందు నిలకడగా ఉండుడి, పౌరుషముగలవారై యుండుడి, బలవంతులై యుండుడి. మీరు చేయు కార్యము లన్నియూ ప్రేమతో చేయుడి"
(1 కొరిం 11:28, గల 6:7, 8; 1 కొరి 6:9-10, 16:13-14).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

# రస ధార లు

ఆమోసు 9:11-15 వచన భాగములు మనము పరిశీలించి
ట్లయిన ఆ నాటి ఇశ్రాయేలీయులను దేవుడు ఎంతగా ప్రేమించి
అంతటి ఉన్నత స్థితిని కలిగింతునని ప్రవక్తద్వారా మాట్లాడెనో
గ్రాహ్యమవుతుంది.—రాబోవు దినములలో కోయువాడు దున్ను
వారి వెంటనే వత్తురు. విత్తనములు చల్లువారి వెంటనే ద్రాక్షపండ్ల
త్రొక్కువారు వత్తురు. పర్వతములనుండి మధురమైన ద్రాక్షరసము
స్రవించును. కొండలన్నీ రసధారలగును.

ఆధ్యాత్మికముగ మనము ఈ సంగతులను అవగాహన చేసు
కుంటే, కోత, క్షేత్రము, విత్తనం, పండ్లు, రసధారలు అనే అంశము
లన్నియు మానవ సమాజము దేవుని వాక్యము అనే విత్తనంద్వారా
ఫలభరితం కావాలని దేవుడు కోరుచున్నట్లుగా గ్రహించగలము.
"నేను వారిని నాటుదును" అను మాట గొప్ప వాగ్దానమై యున్నది.
ఆ వాగ్దానము ఇప్పుడు నెరవేరుచునే యున్నది. క్రీస్తు యేసులోను
ఆయనతోను లేక ఆయన నామము ధరించుకున్న "సంఘము" ద్రాక్ష
తోట కాగా, మధుర రసమును స్రవించు కొండలు క్రైస్తవు
గుండెలై యున్నవి. యూదులు అన్యులు క్రీస్తులో సమాన వారసుల
(గల 3:28). ద్రాక్షవల్లి, ఫలములిచ్చునే కానీ, ఆ ఫలములనది
భుజించదు. ఫలించిన పండ్లు రసముకొరకు పిండబడును (గానుగలలో
త్రొక్కబడును). ఆ రసమును ద్రాక్ష చెట్టు ఆరగించదు. ఫలమిచ్చు
చెట్టు ఏదైనా దాని ఫలముల నది భుజించదు. కాయలున్న చెట్టుకే
రాళ్ళ దెబ్బలు అన్నట్లు కాయమంతా గాయములొంది తన రక్తమును
పరులకొరకు ధారవోసాడు ప్రభువైన క్రీస్తు. ఆయనలోని రసధారల
కల్వరినుండి స్రవించుచున్నవి. క్రీస్తు తనను తాను ద్రాక్షవల్లిగా
పోల్చుకున్నారు. క్రీస్తు జన్మకు ముందే ఇశ్రాయేలీయులు యూదా

జాంగము శ్రేష్ఠమైన ద్రాక్ష తీగెలని యెషయా ప్రవక్తద్వారా ప్రభువైన దేవుడు ప్రకటన జేసాడు (యెష 5:2). అయితే వీరు కారు ద్రాక్షలుగా చేయబడుట చూచి ఆయన పరితపించాడు (7, 8 వచనములు). అన్యాయము అక్రమము బలురక్కసి చెట్లవలెను గచ్చపొదలవలెను బలీయమైన వారి బ్రదుకుల నావరించిన హేతువుచే వారు కారుద్రాక్షలుగ అభివర్ణించబడిరి. వారు సద్వర్తన కలిగి సత్ ఫలములు ఫలించాలని ఆయన తన ప్రవక్తలద్వారా వారితో మాట్లాడెను. స్నానికుడైన యోహాను వారి నుద్దేశించి, సర్పసంతానమా... మారుమనస్సుకు తగిన ఫలము ఫలించుడి. మంచి ఫలము ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిపాలవుతుంది అని హెచ్చరించాడు. మత్తయి 3:5-10.

## నిజమైన ద్రాక్షవల్లి

కారణజన్ముడైన క్రీస్తు కారుద్రాక్షలను మారుమనస్సు ద్వారా శ్రేష్ఠమైన ద్రాక్షవల్లులుగా చేయుటకు నిజమైన ద్రాక్ష వల్లిగా ప్రత్యక్షమైనారు (యోహాను 15 : 1-5). ఆయనయందు విశ్వాసముంచిన వారికిది గొప్ప మేలుకొలుపు. "నేను నిజమైన ద్రాక్షావల్లిని" నాయందు నిలిచియుండువాడు బహుగా ఫలించును. అవును యేసుక్రీస్తు నిజమగు ద్రాక్షావల్లియే. ద్రాక్షావల్లిగ ఆయన ఎందుకు పోల్చుకొనెనో కొంత ఆలోచన చేయుదము. ద్రాక్షలు పలురకము లున్నందున యేసు నిజమైన నిత్యమైన ద్రాక్షవల్లిగా పోల్చుకొనెను.

ద్రాక్ష చెట్టు :—1769 సం॥లో ఒక ద్రాక్షతీగ చుట్టుకొలత 6 అడుగుల 2 అంగుళాలుండిట. దాని తల్లి తీగ 160 అడుగులుండిట. అందుకే దీనిని ద్రాక్షచెట్టు అని పిలిచినా సందియమక్కర్లేదు.

ఏదెను తోటలో ఆదాము ద్రాక్షఫలము తినియే యుండును.

అయితే ఆ ద్రాక్షావల్లి మనకు అందుబాటులో లేదు. జలప్రళయం తర్వాత ద్రాక్షాప్రస్తావన కనిపిస్తోంది. నోవహు ద్రాక్షా సేద్యం చేసాడు. ఆది కా. 9:20. కాస్పియన్ సముద్ర ప్రాంతంలో కనుపించిన ద్రాక్ష క్రమ క్రమంగా ఆసియా మైనరు దేశాలకు వ్యాపించింది. క్రీ॥ పూర్వం 600 సం॥ కాలంలో గ్రీసునుండి సిసిలీ దేశానికి ద్రాక్ష పయనించింది. క్రీ॥శ॥ 23-27 కాలంలో 91 రకాల ద్రాక్ష లున్నట్లు ఫ్లీన్లే అను నతడు వ్రాసాడు. క్రీ॥శ॥ రెండో శతాబ్దంలో విశ్వ వ్యాప్తంగా ద్రాక్ష విస్తరించింది.

హోమర్ కాలంలో ద్రాక్షారసం ఒక విలాస పానీయంగా వాడేవారట. రాజులు విందు సమయాలలో ద్రాక్షారససేవనం గావించేవారట. విక్టోరియా కాలంలో ద్రాక్షా పందిరి విలాసవంతుల గృహాల ముందుండేదిట.

**ద్రాక్ష దిగుబడి :**-ఒక్కొక్క తీగ 2 వేల పౌనుల ఫలాలిచ్చే దట. ఎష్కోలు లోయలో ఒక ద్రాక్ష గెలను ఇద్దరు బలాఢ్యులు దండెతో మోసికొచ్చారు (సంఖ్యా కాండము 13 : 23). మూడు నాలుగు వందల ఏండ్లు పాటు పండ్లనిచ్చే ద్రాక్షవల్లు లుండేవట. క్రీస్తు అనే ద్రాక్షావల్లికి కాలపరిమితి లేదు (ప్రకటన 1:18).

**ద్రాక్షలో సుగుణం :**-ఈ పండ్లలో ఒక రకం పంచదార ఉంటుంది. దీనినే "డెక్స్ట్రోస్" అంటారు. ద్రాక్షరసం పులిస్తే పైతేట "ఆల్గాల్" వస్తుంది. పానీయాల్లో వంట సోడాల్లో కొన్ని మందుల తయారీలో ఇది ఉపయోగింపబడుతుంది. శరీర శుద్ధి కుపక రించే క్షారకారక గుణం ద్రాక్షపండ్లలో గల పంచదార నిల్వఉన్న క్రొవ్వు పదార్థాలను ఉపయోగంలోకి తెస్తోంది. ద్రాక్షరసం పచ్చిది ఎంత త్రాగినా క్రొవ్వు పట్టదు హాని చేయదు. పులియ బెట్టిన రసాన్ని సారాయం వందురారు. దానిని సేవించువారు మత్తులౌతారు.

ఇంచేత మందదృష్టి, మతి తప్పుట, దుష్కామ ప్రవర్తన, మొదలగు నీచకార్యలు చేస్తారు. అందుకే క్రైస్తవులు "మద్యముతో మత్తులు కారాదు" అని లేఖనం చెపుతుంది (ఎఫెసి 5:18). నాజీరులు ద్రాక్ష సేవనం విసర్జించాలని వ్రాయబడినది (సంఖ్యా 6:1-4, న్యాయా 13 : 4, లూకా 1 :16).

క్రొత్తనిబంధనలో క్రీస్తు శరీర రక్తముల సంస్మరణలో ద్రాక్షారసము ప్రత్యేకతను సంతరించుకున్నది (మత్త 26 : 28). మారుమనస్సు బాప్తిస్మం ద్వారా (గలతీ 3:27) క్రీస్తును ధరించుకున్న వారు నిజమైన ద్రాక్షావల్లిలో తీగలై యున్నారు. వారు పవిత్రులు, ప్రకృతి సంబంధులు కారుదాక్షలు కాక, శ్రేష్ఠ ఫలములిచ్చే ఆత్మ సంబంధులు, ఆత్మ ఫలములు ఫలింతురు (గలతీ 5:16-24). వారి ఫల ములు దేవునికి మానవులకు అందింతురు. ద్రాక్షావల్లి నిస్వార్థ సేవకు గుర్తుగాయున్నది (న్యాయాధి 9:13). అందువలన క్రైస్తవులు స్వార్థ ప్రియులు కారాదు. వారి రక్షకుడైన యేసువలెనే పొరుగులను ప్రేమించి వారి ఫలముల రసధారలను ఇతరులకు అందించి ఆనందింతురు.

యేసు నిజమైన ద్రాక్షావల్లి. తన కొరకు తాను ఏమీ మిగుల్చుకోలేదు. మానవ మైత్రికొరకు తండ్రి మహిమకొరకు తన్ను తాను అర్పించుకొనెను (ఫిలిప్పీ 2 : 4-8, ఎఫెసి 5 : 1-2). మనమైతే ఏమిచేయుచున్నామో ?

—సామ్యూల్ జాన్ మేడిద, కొణితివాడ.

— o —

## గొప్ప వైద్యుడు

## ( The Great Physician )

యేసుక్రీస్తు కంటె గొప్ప వైద్యుడు ఎవడు లేడు. ఆయన ముప్పదియో సంవత్సరం వచ్చే వరకు ప్రాక్టీసు మొదలు పెట్టలేదు.

ఆయన ఏ వైద్య కళాశాలకు హాజరవ్వలేదు. ప్రాక్టీసు చేయుడానికి ప్రభుత్వం నుండి ఆయనకు లైసెన్సు అక్కర్లేదు. రోగులనెవ్వరిని ఆయన ఆసుపత్రికి పంపలేదు. తన సేవ నిమిత్తమై ఒక్క పైసాకూడ ఆయన ఫీజుగా తీసికోలేదు. ఆయన బాగుచేయని రోగమంటూ యేమీ లేదు. గొప్పవారిని బీదలను ఆయన ఒకేలాగ చూచేవాడు. తన చేతులుంచగానే జ్వరం పారిపోయేది. కుష్ఠురోగం మాయమయ్యేది. ఆయన మాట చెప్పగానే ఘోర పీడితుడై చాంద్రరోగియైన సేవకుడు స్వస్థపడేవాడు. ఆయన దయ్యములను వెళ్ళగొట్టేవాడు, రోగుల సందరినీ బాగుచేసేవాడు. ఆయన కొరకు యిల్లుగాని, క్లినిక్ గాని, ఆఫీసుగాని లేదు. ప్రజలకు పరిచర్య చేయుటకు ఆయన కాలినడకను వెళ్ళేవాడు. ఒక్కోసారి దోనెలోను, మరొకసారి గాడిద మీదను పయనించేవాడు. పైశాచిక మానవుని ఆయన సాధువుగా చేయగలిగేవాడు. పక్షవాయువుతో మంచము పట్టియున్న వానికి, నీవు లేచి నీపడక నెత్తుకొని నడువుమని ఆయన చెప్పగానే అతడు నడిచేవాడు.

యేసుప్రభువు పాపులతోను సుంకరులతోను సహవాసము చేసాడు. వారితో కలసి భోజన పానాదులు చేసేవాడు. విడిచి వెళ్లిపోయిన ఆత్మను తిరిగి పిలిచి చనిపోయిన శరీరాన్ని తిరిగి జీవింపజేసేవాడు. గుడ్డివారు చూడగల్గునట్లు, చెవిటివారు వినగల్గునట్లు, మూగవారు మాట్లాడగల్గునట్లు ఆయన చేసేవాడు. పన్నెండు సంవత్సరముల నుండి రక్తస్రావముతో బాధపడుచున్న స్త్రీ యొకతె ఆయన వస్త్రపు చెంగు ముట్టగానే బాగుపడింది. ఆయన కనికరముగలవాడు. ప్రేమించేవాడు. జాలిగలవాడు. రోగులు ఆయన యొద్దకు వచ్చేవరకు ఆయన కనిపెట్టేవాడు కాదు. ఆయనే వారి యొద్దకు వెళ్లేవాడు.

యేసుప్రభువు తన 12 మంది శిష్యులకు స్వస్థపర్చే శక్తినిచ్చి రోగులను స్వస్థపర్చుటకు, చనిపోయిన వారిని లేపుటకు, కుష్ఠురోగు

లను శుద్ధులనుగా చేయుటకు, దయ్యములను వెళ్ళగొట్టుటకు, ఇదంతా ఉచితముగా చేయుటకు ప్రజలయొద్దకు వారిని పంపాడు. మీరు ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి అని ఆయన వారికి చెప్పి పంపాడు (మత్త 10 : 8, 9). మిమ్మును హింసించు వారిని దీవించుడి, మీ శత్రువులను ప్రేమించుడి, వారికొరకు ప్రార్థన చేయుడి. ఆయన నామమున వారికి గిన్నెడు మంచినీళ్ళు యిచ్చినవారి ఫలము పరలోకములో అధికమగునని ఆయన వారికి చెప్పాడు.

గ్రుడ్డివారు చూడగల్గు నట్లును, కుంటివారు నడవగల్గునట్లు, కుష్ఠురోగులు బాగుపడునట్లు, చెవిటివారు వినగల్గునట్లు, చనిపోయిన వారు సజీవులగునట్లు చేయుటవలనను బీదలకు సువార్త ప్రకటించుట వలనను ఆయన దైవత్వాన్ని ఋజువు చేసికొన్నాడు. ఆయన దూషింపబడ్డాడు, ద్వేషింపబడ్డాడు, హింసింపబడ్డాడు. అయినను కీడుకు ప్రతికీడు చేయక మేలునే చేసాడు. వేషధారులను అబద్ధ బోధకులను దుష్టత్వాన్ని ఆయన గద్దించాడు. ప్రయాసపడి పనిచేయు వారలకు ఆయన విశ్రాంతి నిచ్చాడు. సబ్బాతు దినమున స్వస్థత పర్చినందున ఆయన సబ్బాతు నుల్లంఘించాడని ఆయన శత్రువులనుకొన్నారు. రొట్టెలు చేపముక్కలతో ఆయన అయిదు వేల మంది పురుషులకు ఆహారము పెట్టాడు. అయినా అందు నిమిత్తం ఆయన చేపల బజారుకుగాని, రొట్టెల దుకాణము దగ్గరకుగాని వెళ్ళనే లేదు. ఏమానవుడు ఎన్నడు చేయని గొప్ప ప్రసంగాన్ని ఆయన చేసాడు, ఏమానవుడు ఎన్నడు చేయని బోధలను ఆయన చేసాడు. ఆయన మానవు లందరిలో గొప్ప జ్ఞాని. గలిలయ సముద్రపు తుఫాను నణచే శక్తి ఆయనకుండెను. తాను స్థాపించిన సంఘానికి ముఖ్యమైన మూల రాయి ఆయనే. పెద్దల పారంపర్యాచారముల నుల్లంఘించుచు శుద్ధమైన స్వచ్ఛమైన బోధను ఆయన చేసాడు. భూమ్యాకర్షణ శక్తి సూత్రములనొక ప్రక్కన బెట్టి నీళ్ళమీద ఆయన నడిచాడు. ఆయన

యూదయ గలిలయ సమరయ ప్రాంతములలోనే ప్రయాణించాడు. భూమిమీద ఉండగా ఎన్నడో చనిపోయిన మోషే ఏలియాలతో ఆయన సంభాషించాడు. చిన్న పిల్లల నాయన ప్రేమించాడు. వారిని ఎత్తుకొని దీవించేవాడు. తన మరణాన్ని గూర్చి ముందుగనే తెలియ జెప్పాడు. తన గొర్రెల నిమిత్తము ఆయన తన ప్రాణ మర్పించు చున్నానని చెప్పాడు. ధనాన్ని ఆయన ఉపేక్షించాడు, బీదలకు మిత్రుడయ్యాడు.

మానవులకు యేసుప్రభువు ఎన్నో మేళ్ళు చేసినా, తన శిష్యు లలో ఒకడు ఆయనకు ద్రోహం చేసాడు. రోమా గవర్నరయిన పిలాతు ఆయనను న్యాయ విమర్శ చేసినా ఆయనలో దోషమేమియు కనుగొనలేకపోయాడు. అబద్ధ సాక్ష్యాలపై ఆధారపడి ఆయనను యిద్దరు దొంగలమధ్య సిలువ వేసి చంపారు. మానవాళి పాపప్రాయ శ్చిత్తార్థ బలిగా తన ప్రాణము నర్పించి, మూడవ దినమున ఆయన సమాధినుండి సజీవుడై తిరిగి లేచాడు. ఆయన అనుగ్రహించే ఉచిత రక్షణను పొందగోరు వారందరి దరపున దేవుని సన్నిధిలో విజ్ఞాపనము చేయుటకై ఆయన పరలోకానికి ఎక్కి వెళ్ళాడు.

ఇంచుమించు గత రెండువేల సంవత్సరములుగా ఆయన అగో చరుడై యున్నను, ఆయనయందు విశ్వాసముంచి పాపములో మునిగి పోవుచున్న ఆత్మలను ఆయన పైకెత్తుచునే యున్నాడు. విరిగిన హృద యాలను ఆయన ఇంకా బాగు చేయుచున్నాడు. వారి ఆత్మలనే ఉజ్జీ వింపజేసి, మరణానంతర నిత్యజీవ నిరీక్షణ నొసగుచునే యున్నాడు. ఆయన సువార్త వాక్యమును నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడిన వారు తనతో నిత్యము ఉండులాగున ఆయన వారికొరకు స్థలము సిద్ధపరచుచున్నాడు. ఒకానొక దినమందు ఆయన వచ్చి వారిని పరమునకు కొనిపోతాడు. అవిశ్వాసులను, అవిధేయులను నిత్యనర

గ్నకి పాలుచేస్తాడు. పరమ వైద్యుడు యేసుక్రీస్తు మీయొద్ద
రూకలు లేకపోయినను, ఏమియు నియ్యకయే ఆయన యిచ్చు నిత్య
స్వస్థతను ఉచితముగా పొందుమని మిమ్మును ఇంకా ఆహ్వానించు
చునే యున్నాడు (యెష 55 : 1-2).

---

## మనలో నివసించు పరిశుద్ధాత్మ

## (Indwelling of the Holy Spirit)

పరిశుద్ధాత్మ యొక్క అద్భుత వరములనుగూర్చి ఇదివరకొకసారి
మనము నేర్చుకొని యున్నాము. ఆ యద్భుత వరములు క్రొత్త
నిబంధన సంపూర్తిగ వ్రాయబడగా లేక అపొస్తలు లందరు చనిపోగా
నిలిచిపోయెనని మనము గ్రహించి యుంటిమి. అయితే యేసుక్రీస్తు
నందు నమ్మి బాప్తిస్మము పొందిన ప్రతివానికి పరిశుద్ధాత్మ అను
వరము వాగ్దానము చేయబడెను. పెంతెకోస్తునాడు మొట్టమొదటి
సువార్త ప్రసంగమును చేయుచు "పేతురు - మీరు మారుమనస్సు
పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున
బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము
పొందుదురు. ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్థు
లందరికిని చెందునని వారితో చెప్పెను" (అపొ. కా. 2:38, 39).

పరిశుద్ధాత్మ యొక్క అద్భుత వరములకును, ఇక్కడ చెప్ప
బడిన పరిశుద్ధాత్మ అను వరమునకును గొప్ప వ్యత్యాస మున్నది.
ఎవరైతే సువార్తకు లోబడుదురో అట్టివారు పరిశుద్ధాత్మను పొందు
దురు. ఇది అద్భుతములు చేయు శక్తి కాదు. "మేమును, దేవుడు
తనకు విధేయులైనవారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మయు, ఈ సంగతు

లకు సాక్షులమై యున్నామని" అపొస్తలులు అపొ. కా. 5:32 లో చెప్పిరి. "ఆయన ఆజ్ఞలను గైకొనువాడు ఆయనయందు నిలిచి యుండును. ఆయన వానియందు నిలిచియుండును; ఆయన మనయందు నిలిచి యున్నాడని ఆయన మన కనుగ్రహించిన ఆత్మ మూలముగా తెలిసి కొనుచున్నాము" అని యోహాను వ్రాసెను (1 యోహాను 3 : 24). క్రీస్తుయొక్క ఆజ్ఞలను గైకొనుటద్వారా క్రైస్తవుడు క్రీస్తునందు నిలిచియుండును; అప్పుడు క్రీస్తును, పరిశుద్ధాత్మయు వారిలో నిలిచి యుందురు.

## ఆత్మ ఫలములు

క్రైస్తవునిలో పరిశుద్ధాత్ముడు నివసించడు అని ఎవరైనను తలంచిన యెడల అట్టివారు దేవుని ఉనికినే తిరస్కరించువారగుదురు. "ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచియుండలేదు; మన మొకని నొకడు ప్రేమించినయెడల దేవుడు మనయందు నిలిచియుండును; ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును.. ఏలయనగా ఆయన మనకు తన ఆత్మలో పాలు దయచేసి యున్నాడని" 1 యోహాను 4:12-13 లో వ్రాయబడి యున్నది. క్రైస్తవునిలో నివసించు పరిశు ద్ధాత్ముని మన మెవరము భౌతిక నేత్రములతో చూడలేకపోయినను, క్రైస్తవుని జీవితములో ఆత్మ ఫలములను, క్రియలను మనము చూడ గలము. ఒక చెట్టును దాని ఫలములవలన అది మంచిదో లేక చెడ్డదో మనము తెలిసికొనగలమని క్రీస్తు బోధించెను (మత్తయి 7 : 16-20). అట్లే క్రైస్తవుడు ఫలించు ఫలములనుబట్టి అతడు పరిశుద్ధాత్మను కలిగి యున్నాడో లేదో మనము తెలిసికొనగలము.

"అయితే ఆత్మ ఫల మేమనగా - ప్రేమ, సంతోషము, సమా ధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము,

సాత్వికము, ఆశానిగ్రహము. ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు" అని గలతీ 5:22, 23 లో అపొ. పౌలు బోధించెను.

క్రైస్తవులమని చెప్పుకొనుచు ఒకరి నొకరు ద్వేషించుకొను వారు, కలహములాడుకొనువారు, అసూయ, మత్సరము, అపవిత్రతో నిండియున్న వారు పరిశుద్ధాత్మ వారిలో నివసించుట లేదని బహిరంగ ముగా సాక్ష్యమిచ్చు వారై యున్నారు. అట్టివారిలో నివసించునది అపవిత్రాత్మ యేగాని దేవుని ఆత్మ కాదు.

ప్రేమతో నిండియున్న హృదయములలో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు నివసించుచు రాజ్యమేలుదురు. దేవుని ప్రజలు ఎల్లప్పుడు సంతోషము కలిగినవారు. క్రైస్తవుని హృదయములో సమాధానము పరిశుద్ధాత్మ వలన కలుగు ఫలమై యున్నది. అందుకే "సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు" అని యేసు బోధించెను (మత్తయి 5 : 9). క్రైస్తవుని హృదయములో పరిశుద్ధాత్ముడు నివసించునప్పుడు అతని జీవితములో దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము అను గుణములు బాహాటముగ కన్పడును. ఇట్టి ఆత్మఫలములను ఫలించువాడే దేవుని ఆత్మను కలిగియున్నవాడు. ఈ ఆత్మ ఫలములు అద్భుత వరములుకావు.

## ఆత్మకు ఆలయం

క్రీస్తునందు విశ్వసించి, మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన ప్రతి క్రైస్తవునిలోను పరిశుద్ధాత్ముడు నివసించును. కొరింథులోని క్రైస్తవులకు వ్రాయుచు అపొ. పౌలు ఇట్లనుచున్నాడు: "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీ

రెరుగరా? మీరు మీసొత్తు కాదు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింథి 6 : 19, 20). మన దేహములు దేవుని ఆత్మకు ఆలయమై యున్నప్పుడు దానిని మన మెంత పవిత్రముగ యుంచవలెనో నేను మీకు వేరే చెప్పనవుసరము లేదు. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీ రెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును. దేవుని ఆలయము పరిశుద్ధమైనది; మీరు ఆ ఆలయమై యున్నారు" అని 1 కొరింథి 3 : 16, 17 లో పౌలు మరల మనలను హెచ్చరించు చున్నాడు.

మనము చూచిన ఈ వచనములనుబట్టి మనము క్రీస్తు ఆజ్ఞలకు విధేయత చూపించినప్పుడు పరిశుద్ధాత్ముడు మనలో నివసించుచు మనలను సన్మార్గమున నడిపింపజేయును అని గ్రహించవలెను. మనము దేవుని చిత్తమునకు లోబడినప్పుడే ఆయన ఆత్మ మనలో నివసించును. అయితే ఒకని హృదయము పాపముతో నిండియుండినయెడల అతనిలో పరిశుద్ధాత్మనికి తావు లేదు. అట్లుగాక క్రైస్తవుని హృదయములో పరిశుద్ధాత్ముడు నివసించుచున్న యెడల అతడు తన జీవితములో ఆత్మ ఫలములను కనబరచును.

## వాక్యము ద్వారా మనలో నివసించు ఆత్మ

అయితే పరిశుద్ధాత్ముడు మనలో ఎట్లు నివసించును ? అనే ప్రశ్న మనకు ఇప్పుడు ఉద్భవింపవచ్చును. ఈనాడు నేను జీవించి యున్నాను. నా ఆత్మ నాలో నివసించుచున్నదని నేనురుగుదును. అది ఎట్లు నివసించుచున్నదో నేనెరుగను గాని నా ఆత్మ నాలో నివసించుచున్నదని నేనెరుగుదును. అయితే దేవుని "ఆత్మనుగూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించును" అని గలతీ 3:14 లో

అపొ. పౌలు చెప్పుచున్నాడు. ఈ విశ్వాసము దేవుని వాక్యమును వినుటద్వారా కలుగునని రోమా 10:17 లో అతడు బోధించెను.

దేవునియొక్క వాక్యముద్వారా దేవుని ఆత్మ మనలో నివసించునని దైవవేదము బోధించుచున్నది. "ఆత్మపూర్ణులై యుండుడి" యని ఎఫెసీ 5:18 లో పౌలు హెచ్చరించుచున్నాడు. అయితే కొలస్స 3 : 16 లో "క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి యని" అతడు చెప్పుచున్నాడు. గనుక క్రీస్తు వాక్యమును మనలో సమృద్ధిగా నివసింపనిచ్చుటయే ఆత్మతో నింపబడుటయని మనము గ్రహించుకొనగలము.

పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యమును అపొస్తలులకు బయలు పరచెను. దేవుని వాక్యము ఆత్మ ఖడ్గమైయున్నది (ఎఫెసీ 6 : 17). పరిశుద్ధాత్ముడు వాక్యమువలన "పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పునుగూర్చియు లోకమును ఒప్పుకొనజేయును" (యోహాను 16:18). పరిశుద్ధాత్ముడు ఖడ్గమును వినియోగించును. ఆ ఖడ్గమే దేవుని వాక్యము. "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4 : 12). "అందుచేత సమస్త కల్మషమును, విరివిగుచున్న దుష్టత్వమునుమాని లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" యని యాకోబు 1:21 చెప్పుచున్నవి.

పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యముద్వారా మనలో నివసించును. దేవుని వాక్యముద్వారానే ఆయన మనలను రక్షించును. క్రైస్తవునిలో నివసించు పరిశుద్ధాత్మయే చావునకు లోనైన అతని శరీరమును జీవింప

జేయును: "మృతులలో నుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించినయెడల, మృతులలో నుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును" అని రోమా 8:11 లో వ్రాయబడి యున్నది.

పరిశుద్ధాత్ముడు క్రైస్తవునిలో నివసించునను సంగతి యధార్థము. అది అద్భుతములు, నానారకములైన అర్థరహితమైన భాషలు పలికించునట్టి ఆత్మ కాదు. నిజముగా దేవుని ఆత్మను కలిగియున్నవాడు ఆత్మ ఫలములను ఫలించుచు దేవునికి మహిమ తెచ్చును. దేవుని ఆత్మ లేనివారు వేషధారులై ప్రజలను మోసపుచ్చుచు తమ్మును తామే మోసపుచ్చుకొందురు.

తండ్రియైన దేవుడు కుమారునిద్వారా వాగ్దానము చేసిన పరిశుద్ధాత్మ అను వరమును పొందవలెనంటే అది ఈనాడు నీకును సాధ్యమే. క్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమును ఒప్పుకొనుచూ బాప్తిస్మము పొందుము. ఆయన నీ పాపములను క్షమించి పరిశుద్ధాత్మ అను వరమును నీకు తప్పక అనుగ్రహించును (అపొ. కా. 2:38).

—జాషువా గూటం.

—o—

## సంక్షిప్త వార్తలు

ఏప్రిల్ నెల సువార్తికుల సదస్సు మరియు సువార్త కూటము 27వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా తామరాడలో జరిగెను. అత్యానంద దాయకంగా ప్రారంభమైన ఉదయకాల సమావేశములో "మోషే ధర్మశాస్త్రము కొట్టివేయబడెనా? పాత, క్రొత్త

నిబంధనల మధ్య వ్యత్యాసమేమి? అను అంశము చర్చింపబడెను. T.Ch. స్లెమింగ్సగారు అధ్యక్షులుగానుండి సమయోచితంగాను, సమర్థవంతముగాను కార్యక్రమము నడిపించిరి. సో॥ N. మోజెస్ గారు (కరుగోరుమిల్లి) జి. షడ్రిక్ గారు (పాలకొల్లు) M. జోసఫ్ గారు (పెనుమంచిలి) యు. ఇశ్రాయేలురాజుగారు (కాపవరం) యస్. కృష్ణ మూర్తిగారు (గంటి) వి. యేసుదాసుగారు (పాలకొల్లు) నెహెమ్యా గూటంగారు (కాకినాడ) మరియు పాల్ గూటంగారు (గొల్లవిల్లి) చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశంలో కూడ చర్చకొన సాగెను. సోదరులు E.K.V. ప్రసాదరావుగారు అధ్యక్షత వహించగా సోదరులు యస్. ఎబినెజరుగారు (పాలకొల్లు) మరియు హైదరాబాద్ నుండి వచ్చిన సోదరులు పి. ప్రకాశంగారు చక్కని వర్తమానమును అందించిరి.

నేడు విభిన్న మతశాఖలు, పరస్పర విరుద్ధమైన బోధలు సత్యాన్వేషులకు కలవరాన్ని కలిగిస్తున్నాయి. పాత నిబంధన యందలి కొన్ని ఆజ్ఞలను, క్రొత్త నిబంధన యందలి కొన్ని ఆజ్ఞలను కలిపి, నేటి క్రైస్తవులు వీటిని ఆచరించవలెనని కొందరు బోధిస్తున్నారు. ఐగుప్తు బానిసత్వము నుండి విడిపింపబడినందులకు గుర్తుగా ఇశ్రాయేలీయుల కివ్వబడిన సబ్బాతును క్రైస్తవులు ఆచరించాలని బోధించే బోధవింటే సత్యము ఏ విధముగా మరుగు చేయబడుచున్నతో గ్రహించగలము (ద్వితీ 5:15). మత్త 5:17లో "ధర్మశాస్త్రమును..... కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు" అని యేసు ప్రభువు చెప్పెను. నెరవేరు వరకు దానినుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని ప్రభువు సెలవిచ్చెను. ధర్మశాస్త్రము నెరవేర్చబడిన తరువాత ఏమగును? కొట్టివేయబడునుకదా! లూకా24:44లో ధర్మశాస్త్రములో నన్ను గూర్చి వ్రాయబడినవి నెరవేరినవని యేసుశిష్యులతో చెప్పెను. అందుచేతనే పౌలు ఈ విషయాన్ని విపులంగా తెలియజేసెను. "పాత

నిబంధన క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక ఆ ముసుకే నిలిచియున్నది" (2 కొరింథీ 3:14) మరియు "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరు చేయబడియున్నారు, కృపలోనుండి తొలగిపోయియున్నారు" (గలతి 5:4) అని చెప్పిరి.

పాత క్రొత్త నిబంధనల వ్యత్యాసం లేఖనముల వెలుగులో చదువుదాం.

| | |
|---|---|
| 1. పాతనిబంధన రాతిపలకలపై వ్రాయబడెను (నిర్గమ 26:27) | క్రొత్త నిబంధన హృదయములపై వ్రాయబడెను (హెబ్రీ 8:10) |
| 2. పా.ని. మోషేద్వారా అనుగ్రహింపబడెను (యోహా 1:17) | క్రొ.ని. క్రీస్తు ద్వారా కలిగెను (యోహా 1:17) |
| 3. పా.ని. మేకలయొక్కయు, కోడెలయొక్కయు రక్తము చిందింపబడెను (హెబ్రీ 9:12) | క్రొ.ని. క్రీస్తు రక్తము చిందింపబడెను (హెబ్రీ 9:12) |
| 4. పాత నిబంధన లోపము గలది (హెబ్రీ 8:7) | క్రొత్త నిబంధన శ్రేష్ఠమైనది (హెబ్రీ 7:22) |
| 5, పాత నిబంధన పాపములను తీసివేయలేదు (హెబ్రీ 10:11) | కొ.ని. పాపములనుండి పవిత్రపరచును (1యోహా 1:7) |

తాత్రి కూటములో సోదరులు పౌలు గూటంగారు వాక్యమును బోధించిరి. ఈ ప్రసంగము అనేక హృదయాలను ఆకర్షించెను.

తామరాడలో సోదరులు పి. సామ్యూల్ రాజు గారు సువార్త ప్రకటించుచున్నారు.

* * *

మే నెల సువార్తికుల సదస్సు (Preachers Workshop) కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో 26వ తేదీ బుధవారం ఘనంగా జరిగెను. ఈ సదస్సుకు సువార్తికులేగాక వారి సతీమణులు కూడ ఆహ్వానింపబడి, పాల్గొనిరి. సమావేశ ఆరంభ కాలానికి స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ప్రాంగణ అంతా సోదర సోదరీలతో నిండి పోయింది. పలు ప్రాంతములనుండి వచ్చిన సువార్తికులు "పరిశుద్ధాత్మ నేడు క్రైస్తవునిలో ఎట్లు నివసించును: అద్భుత రూపమునా ? లేక వాక్యరూపమునా ?" అను అంశమును చర్చించిరి.

"క్రీస్తు సంఘస్థులు పరిశుద్ధాత్మను నమ్మరు" అని మతశాఖల వారు నిరాధారమైన ఆరోపణ చేస్తారు. పరిశుద్ధాత్మ ఒక వ్యక్తి, ఆయన శక్తికాదు. సృష్ట్యారంభములో ఆయన దేవునితోను, క్రీస్తు తోను ఉండెను. క్రీస్తు ప్రభువు వలన వినిన తండ్రి వాగ్దాన ప్రకారము అపొస్తలులకు ఆదరణకర్తగా నుండుటకు, వారిని సర్వసత్యము లోనికి నడిపించుటకు ఆయన పంపబడెను. దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము పరిశుద్ధాత్మ ప్రేరణ కలిగినదే.

పరిశుద్ధాత్మ వరము నమ్మి బాప్తిస్మము పొందిన ప్రతివానికి వాగ్దానం చేయబడెను (అపొ.కా. 2:38). మొదటి శతాబ్దంలో వాక్యమును స్థిరపపరచుటకు సూచక క్రియలు జరిగెను (మార్కు 16:20). యిప్పుడు మన దేహములు దేవుని ఆత్మకు ఆలయములు (1 కొరింధీ 3:16, 17). మనలో నివసించు పరిశుద్ధాత్మ అద్భుతములు జరిగించదు. ఫలములు ఫలిస్తుంది (గలతీ 5 : 22). విత్తనము దేవుని వాక్యము (లూకా 8:11). వాక్యమూలముగ (1 పేతురు 1:22), ఆత్మమూల ముగ (యోహా 3:5) జన్మించవలెనని లేఖనములు బోధించుచున్నవి. నేడు మానవులను పాపమునుగూర్చి, నీతినిగూర్చి, తీర్పునుగూర్చి ఆత్మ ఒప్పించుచున్నాడు. ఈ పనికి వాక్యమును ఆయన సాధనముగా వినియోగించుచున్నాడు. పరిశుద్ధాత్మ నేడు వాక్యమునకు వేరై నేరుగా అద్భుతరీతిగా క్రైస్తవునిలో నివసించుటలేదు, పనిచేయుటలేదని సోదరులు వివరించిరి.

ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం గం 6-30 వరకు జరిగిన చర్చా కార్యక్రమములో సోదరులు B. యోహాను, R. స్టీవెన్‌సన్,

**U.** స్టాలిన్, **M.** చిట్టి మోజెస్, **R.Ch** సద్గుణరావు, **B.** సుధాకర్, పాల్ గూటం మరియు **P.** ప్రకాశంగార్లు పాల్గొనిరి.

సాయంకాలం స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ భవన నిర్మాణ నిధి సేకరణ విందు జరిగెను. పలురకాల వంటలతో రుచికరమైన శుచికరమైన భోజనాన్ని స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌వారు వచ్చినవారందరికీ రెండుపూటలు వడ్డించిరి. విందులో డైరెక్టర్ నెహెమ్యాగారు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ యొక్క ఔన్నత్యాన్ని, మంచి పనిని, అందించుచున్న సేవలను వివరించారు. ఈ సంస్థ అభివృద్ధి కొరకు నిర్మించబోవుచున్న భవన సముదాయానికి సోదర సోదరీలు, స్థానిక సంఘాలు ఆర్థిక సహాయాన్ని అందించాలని అభ్యర్థించారు. పలువురు సోదరులు నిధి సేకరణలో తోడ్పడుటకు ముందుకు వచ్చారు. ఈ గొప్ప పని సఫలమయ్యేటట్లు అందరు ప్రార్థించుదాం. జూన్ నెల ప్రీచర్స్ వర్క్‌షాప్ రాజోలు మండలంలోని మాకనపాలెంలో 22వ తేదీనాడు జరుగును. ★

---

Regd. No. H/KD—45/KD H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

**No.**

**To**

..............................................

..............................................

..............................................

..............................................